ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 28 జనవరి 2025

మెప్మా ఆర్‌పీలకు జీతాలొచ్చాయ్
● ఏడు నెలల బకాయిలు విడుదల
8

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
● తహసీల్దార్లకు పీఆర్‌టీయూ నాయకుల వినతి
8


కోరుట్ల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ప్రజావాణికి 43 దరఖాస్తులు
8



కమల దళపతి ఎవరో..?

● జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ
● ప్రస్తుత అధ్యక్షుడు సత్యనారాయణ పదవీ కాలం పూర్తి
● రాష్ట్ర కమిటీకి చేరిన జాబితా

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరించనుందోననే పార్టీ వర్గాల్లో చర్చనడుస్తోంది. అధ్యక్ష పదవికి పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ పదవీకాలం పూర్తి కానుంది. నాలుగున్నర సంవత్సరాలుగా మోరపల్లి సత్యనారాయణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జిల్లా ఆవిర్భావం అనంతరం మెట్‌పల్లికి చెందిన సీనియర్ నాయకుడు బాజోజి భాస్కర్ జిల్లా అధ్యక్షుడిగా కొంత కాలం పాటు వ్యవహరించారు. అనారోగ్య కారణం వల్ల భాస్కర్ మృతి చెందాడు. తదుపరి మోరపల్లి సత్యనారాయణ జిల్లా బీజేపీ పగ్గాలు చేపట్టి ఇప్పటివరకు కొనసాగుతున్నారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా సభ్యత్వ నమోదు పూర్తి కావడంతో జిల్లాలోని మండల అధ్యక్షులు, మున్సిపల్ పట్టణాల అధ్యక్షుల ఎన్నిక ముగిసింది. జిల్లా అధ్యక్ష పదవిని భర్తీ చేయాల్సి ఉంది. ఈసారి బీజేపీ అధిష్టానం అత్యంత పకడ్బందీగా కమిటీల కూర్పు చేస్తోంది. జిల్లా అధ్యక్ష పదవులను గతంలో రాష్ట్ర అధిష్టానం ప్రకటించగా ఈసారి జాతీయ పార్టీకి చెందిన కోర్ కమిటీ నిర్ణయం తీసుకోనుంది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో సుమారు 1.10 లక్షల సభ్యత్వాలు ఉన్నాయి.

● ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిని చాలా మంది ఆశిస్తున్నారు. ఇందులో ప్రధానంగా కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పోటీపడుతున్నారు. కోరుట్ల నియోజకవర్గానికి చెందిన నిత్య సాయి చారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిట్నేని రఘు, ప్రముఖ న్యాయవాది వడ్డేపల్లి శ్రీనివాస్, డాక్టర్ యాదగిరి బాబు, జగిత్యాల నియోజకవర్గానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్, ధర్మపురి నియోజకవర్గానికి చెందిన పిల్లి శ్రీనివాస్‌ల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. ఇందులో ముగ్గురి పేర్లను రాష్ట్ర నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న మోరపల్లి సత్యనారాయణ పేరును సైతం అధిష్టానం పరిశీలిస్తోందని ప్రచారం జరుగుతోంది.

● సామాజిక సమీకరణాలపై చర్చ

జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఐదుగురు గతంలో వారు కొనసాగిన పదవులు, అనుభవం, పార్టీ కోసం చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తూ అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారు ప్రముఖ నాయకులతో ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో కొందరు సామాజిక సమీకరణాల ప్రకారం తమకు అవకాశం ఇవ్వాలని యత్నిస్తున్నారు. గతంలో ఆశించి పార్టీ నాయకత్వం సూచనల మేరకు పోటీ నుంచి తప్పుకున్న వారు ఈసారైనా తమకు అవకాశం ..

మిగతా 8లో

మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా గౌతమ్‌రెడ్డి

● ఐదు పురపాలికలకు బాధ్యతలు అప్పగింత


బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మున్సిపల్స్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో వీటన్నంటికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డిని ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జగిత్యాల మున్సిపాలిటీతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా గౌతమ్‌రెడ్డికి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. సోమవారం జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపల్ కార్యాలయాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ప్రత్యేకాధికారిగా బాధ్యతలను స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ రెడ్డిని ఆయా మున్సిపల్స్ కౌన్సిలర్లు, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

ఇళ్లు మంజూరు చేయాలి


ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో 90 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని, ఇళ్లు మంజూరు చేయాలని బీర్‌పూర్ మండలం కండ్లపెల్లి గ్రామానికి చెందిన గిరిజనులు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ సర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.

ఉర్దూమీడియం టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ మార్కజీ కమిటీ నాయకులు మెట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉన్నారని వారికి సరిపడ టీచర్ పోస్టులు లేక విద్యార్థులకు సరైన విద్యా అందడం లేదాని ఉన్నతధికారులు స్పందించి టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మహ్మద్ రాజిద్దున్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వాటితో నేరాల నియంత్రణ సాధ్యమని మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు అన్నారు. సోమవారం పట్టణంలోని అర్బన్ హౌజింగ్ కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎండి షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

కోరుట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు అన్నారు. సోమవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో మాల సంఘ నాయకుల ఆధ్వర్యంలో జువ్వాడి బదర్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పొట్ట లక్ష్మణ్, గోరుమంతుల సత్తయ్య, బలిజ సంతోష్ కుమార్, సామల వేణుగోపాల్, కండ్ల మైఖెల్, బలిజ రాజిరెడ్డి, బద్దా మురళి, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, తేలు కంటి శంకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రంలోని పది, మండలంలోని నాచుపల్లిలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సీడీపీవో వీరలక్ష్మి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు అద్దె భవనాలు, రెండు ఫ్రీ భవనాల లోపల గోడలను పైకప్పును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈకార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


పారిశుధ్య కార్మికురాలికి దుస్తులు అందజేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లు జక్కు పద్మ-రవీందర్, సంగనభట్ల సంతోషి-దినేష్, వేముల నాగలక్ష్మి-రాజేష్, గరిగె అరుణ-రమేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం కోసం టీయుఎఫ్ఐడీసీ గ్రాంటు కింద రూ.15 కోట్లు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేసుకున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లు కౌన్సిలర్లు జక్కు పద్మ, సంగనభట్ల సంతోషి, వేముల నాగలక్ష్మి, గరిగె అరుణ, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్ పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో విప్ పూజలు

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం జిల్లా ఉపాధి కార్యాలయం యందు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి సత్తెమ్మ తెలిపారు. కేఎల్ గ్రూప్ హైదరాబాద్ సంస్థలో ప్యాకింగ్, స్టోయింగ్, సార్టింగ్, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ఖాళీల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎస్సెస్సీ మరియు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి, ఇంగ్లీషు పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ

● జిల్లాలో15,676 మంది రైతులకు రూ.15.49 కోట్లు విడుదల



జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను ఆయా రైతుల ఖాతాలో సోమవారం జమ చేసింది. ఎన్నికల హామీలో భాగంగా రైతు భరోసా అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు విడుదలకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఎకరానికి రూ.6వేల చొప్పున నిధులు ఖాతాల్లో జమ అయ్యాయి.

● మండలాల వారీగా..

జిల్లా వ్యాప్తంగా రైతు భరోసాకు జిల్లాలోని 20మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల నుంచి 15,676 మంది రైతులకు సంబంధించి రూ.15,49,23,932 నిధులను విడుదల చేసింది. జిల్లాలోని బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలోని 888 మందికి రైతులకు సంబంధించి రూ.90,13,042 లు విడుదల కాగా, భీమారం మండలం లింగంపేటలో 443మంది రైతులకు గానూ, రూ.65,19,822, బుగ్గారం మండలం బీర్‌సాని గ్రామంకు చెందిన 379 రైతులకు సంబంధించి, రూ.38,49,629, ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంకు చెందిన 1393 రైతులకు గానూ రూ.1,01,95,815, ఎండపల్లికి చెందిన 1302 రైతులకు గానూ రూ.1,14,96,036, గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో 342 మందికి 38,99,738రూ.లు, ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్‌కు చెందిన 220రైతులకు గానూ రూ.27,69,374, జగిత్యాలకు చెందిన 1874 మందికి రూ.1,08,70,102, రూరల్ మండలం కండ్లపల్లికి చెందిన 1129గానూ రూ.77,92,481, కథలాపూర్ మండలం పోసానిపేట్‌కు చెందిన 423 మందికి రూ.53,34,637, కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన 985 మందికి గానూ రూ.1,15,76,727, కోరుట్ల మండలం కల్లూరు గ్రామంకు చెందిన 717గానూ రూ.92,44,061, మల్లాపూర్ మండలం ధాంరాజ్‌పల్లెకు చెందిన 961 గానూ రూ. 1,07,68,954, మల్యాల మండలం సర్వాపూర్‌కు చెందిన 591కి చెందిన రూ.60,18,099, మేడిపెల్లి మండలం పోరుమల్లకు చెందిన 1636గానూ రూ.2,04,77,189, మెట్‌పెల్లి మండలం విట్టంపేటకు చెందిన 319 మందికి సంబంధించిన రూ.28,33,193, పెగడపల్లికి మండలం ల్యాగలమర్రికి చెందిన 345కు చెందిన రూ.47,11,402, రాయికల్ మండలం ధర్మాజీపేట్‌కు చెందిన 444 రైతులకు గానూ రూ.50,83,646, సారంగాపూర్‌కు చెందిన 500 మంది రైతులకు 54,04,785రూ.లు, వెల్గటూర్ మండలం చెగ్యాంకు చెందిన 785 మంది రైతులకు గానూ రూ.70,65,200 మొత్తం కలిపి జగిత్యాల జిల్లాలోని 20మండలాల్లో గల ఎంపిక చేసిన గ్రామాలకు చెందిన 15,676 మంది రైతులకు సంబంధించిన 21883.1135 ఎకరాలకు చెందిన రూ.15,49,23,932 నిధులు విడుదల అయ్యాయి. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఖాతాల్లో డబ్బులు జమకావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విడతల వారీగా జమ



జిల్లాలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం పథకం అమలులో భాగంగా భరోసా నిధులను విడుదల చేసింది. పథకం ప్రారంభం అవడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. మార్చిలోపు పూర్తి స్థాయిలో ప్రభుత్వం భరోసాను విడుదల చేయనుంది.

-రాంచందర్, డీఏవో

ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయండి


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్థులు

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాల్‌రావుపేట్, పెర్కపల్లి నివాసిత గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటే చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి సోమవారం ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్పందించిన జీవన్‌రెడ్డి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గోపాల్‌రావుపేటలో సుమారు 2000 జనాభా ఉండగా 700 మంది ఓటర్లున్నారని, పెర్కపల్లిలో సైతం సుమారు 600 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తిప్పన్నపేట గ్రామపంచాయితీ నుంచి రెండూ దూరంలో ఉన్నందున గ్రామ పంచాయతీకి వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ పంచాయితీలకు సరిపడా నిధులు లేకపోవడంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోనందున వాటిని ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చడం ఒక్కటే మార్గమనే భావనతో ప్రజలు ఉన్నారన్నారు.

గోపాలరావుపేట, పెర్కపల్లి నివాసిత ప్రాంతాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ లేఖ ద్వారా కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జగిత్యాల జిల్లా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు సుతారి రాములు మాట్లాడుతూ కార్మికులు రెండు రోజులు వంటలు చేస్తూ కష్టపడుతున్నప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదని, మధ్యాహ్న భోజన కార్మికులకు స్థిరమైన వేతన సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టడానికి అప్పులు తీసుకువచ్చి మరీ పెట్టాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇకనైనా తమ సమస్యలను అర్థం చేసుకుని వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేష్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

గిరిజన తండాల్లో ఎక్సైజ్ దాడులు

● 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం ● 30 లీటర్ల సారా స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, గుంటపల్లిచెరువు తండాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శైలజ ఆధ్వర్యంలోని అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 30 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి పదిమంది అనుమానితులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట బైండోవర్ చేశామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. బైండోవర్లను ఉల్లఘిస్తే కఠిన చర్యలు తప్ప వని హెచ్చరించారు. దాడుల్లో సిరిసిల్ల ఎక్సైజ్ ఎస్ఐ ప్రణీత్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, రాజు, మల్లేశ్, కిషోర్‌కుమార్, కృష్ణకాంత్, యోగివర్మ, సర్ధార్‌అలీ, శంకర్, సుమన్, రాకేశ్, సాయికృష్ణ, లలిత, రూప పాల్గొన్నారు.



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పురుగుల మందు తాగి కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన పర్స రాములు (55) అనే కూలీ పురుగులమందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో రాములు ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. కుటుంబీకులు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఉరివేసుకొని..

రామగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో నాగెపల్లి శంకర్(45) ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలంగా క్షౌరవృత్తిని మానేసి తాగుడుకు బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెరట్లో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

గంగాధర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కురిక్యాల శివారులో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు వరద కాలువ దగ్గర రోడ్డు పక్కన 30 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెంది ఉంది. గుర్తు తెలియని వ్యక్తిగా అనుమా దాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళ ముఖంపై రక్తపు మరకలు ఉండగా ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నారు.

చెరువులో మృతదేహం గుర్తింపు

గొల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామ రెవెన్యూ శివారులోని ఎర్రకుంట చెరువులో 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో సోమవారం లభ్యమైంది. మృతుడి ఒంటిపై కాఫీ రంగు నైట్ ప్యాంట్, ఎరుపు, గోధుమ రంగు డబ్బాలు డిజైన్‌తో ఉన్న షర్టు ధరించి ఉన్నట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు అటు వైపు వెళ్లగా చెరువులో మృతదేహం కనిపించిందని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదీ హత్యా..ఆత్మహత్యా..? ఎన్ని రోజుల క్రితం సంఘటనా జరిగింది? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహంను గుర్తు పట్టిన వారు ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి ఫోన్ నెం. 8712656817, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఫోన్ నెం. 8712656826 అనే నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

రాష్ట్ర మహాసభల్లో సీపీఎం నాయకులు



రాష్ట్రసభల్లో పాల్గొన్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు కరీంనగర్ నుంచి జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, కోనేటి నాగమణి, జిల్లాకార్యక్రమాల రిపోర్టును కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి ప్రవేశపెట్టారు.

రేపు వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష

గణేశ్‌నగర్ : వేసవిలో విద్యుత్ సరఫరాపై బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వ హించనున్నారు. నగరంలో కరీంనగర్ సర్కిల్ నోడల్ అధికారి అన్నపూర్ణాదేవి సర్కిల్ ఎస్ఈ సమక్షంలో చర్చించనున్నారు.

కూచిపూడిలో 'ఉజ్వల' ప్రదర్శన

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ
- పలు ఆలయాల్లో ప్రత్యేక ప్రదర్శనలు
- పలువురికి నృత్య శిక్షణ



గుమ్మడి ఉజ్వల

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన గుమ్మడి ఉజ్వల కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. కళల పట్ల ఉన్న ఆసక్తితో కూచిపూడిలో డిప్లమాతో పాటు మాస్టర్స్ చేసి కళాకారులకు శిక్షణ ఇస్తోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు ప్రదర్శనలిచ్చి అవార్డులు, ప్రశంసలు అందుకుంటోంది.



కూచిపూడి నృత్యప్రదర్శనలో ఉజ్వల

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గుమ్మడి పెద్దులు-నిర్మలాదేవి కూతురు ఉజ్వల. చిన్నప్పటి నుంచి కళల పట్ల ఉన్న ఆసక్తితో డిగ్రీ చదువుతూనే గురువుమేదరి నర్సయ్య వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందింది. ఆయన ప్రోత్సాహంతో మంథని సంగీత, నృత్య కళాశాలలో డిప్లోమా పూర్తి చేసింది. అనంతరం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో మాస్టర్స్ పూర్తి చేసి అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నది. తాను నేర్చుకున్న కళను పలువురికి నేర్పించాలనే సంకల్పంతో నృత్య శిక్షణ కేంద్రాన్ని 2014లో స్థాపించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దుతోంది.



అవార్డు అందుకుంటున్న ఉజ్వల

● ఎన్నో అవార్డులు...ప్రదర్శనలు...

ఉజ్వల రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నది. నేటికి కేంద్ర సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శ్రీశైలం, బాసర, వేముల వాడ, తదితర దేవాలయాల్లో, మహాశివరాత్రి, దసరా ఉత్సవాల్లో నృత్య హారతి ఇస్తోంది. 2019లో స్వచ్ఛభారత్ రామగుండం కార్పొ రేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉజ్వల ఎన్నికైంది. ఇటీవల హైదరాబాద్‌లో బుక్ ఫెడరేషన్ కార్య క్రమం, ఘంటసాల శతజయంతి ఉత్సవంలో ఉజ్వల ప్రదర్శన ఇచ్చారు. 2014లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తొలిసారి తెలంగాణ నుంచి సుకూన్ ఫెస్టివల్‌లో ఉజ్వల కూచిపూడి నృత్య ప్రదర్శనిచ్చి ఆకట్టుకుంది.

● పాఠశాలల్లో నేర్పించాలి

తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, ఉజ్వల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో కళను ఒక విద్యగా అందించాలని, కళల పట్ల అవగాహన కల్పించాలని కళా ఉజ్వల ప్రాజెక్టుతో మరో అడుగు ముందుకు వేసింది. ఈ ప్రాజెక్టుతో కళను నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసంపై చైతన్యం తీసుకురావడంతోపాటు ఉపాధి, అభివృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందుకోసం ప్రయత్నం చేస్తున్నానని ఉజ్వల తెలిపారు.

నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించండి!

● ప్రజావాణిలో ప్రభుత్వానికి మిడ్ మానేరు నిర్వాసితుడి దరఖాస్తు ● వ్యవస్థపై నమ్మకం పోయిందన్న చల్లా బాలరాజు

సిరిసిల్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల్ని నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఓ సంచలన దరఖాస్తు వచ్చింది. తనకు నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించాలంటూ ఓ వ్యక్తి ఏకంగా ప్రభుత్వానికే దరఖాస్తు చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన చల్ల బాలరాజు ఈ వినతిపత్రం సమర్పించారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో తమ కుటుంబం 4.50 గుంటల స్థలం, అందులో 1.50 గుంటల్లో ఉన్న ఇంటిని కోల్పోయిందని తెలిపారు. నిర్వాసితుడిగా ఇంటికి సంబంధించి పరిహారాన్ని రూ.16 లక్షలుగా నిర్ణయించారని, ఇందులో రూ.3.09 లక్షల పన్ను మినహాయించి మిగిలింది ఇచ్చారని పేర్కొన్నారు. కానీ, మిగిలిన 3గుంటల స్థలానికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం కింద ఇంటి స్థలాన్ని తాము కోరుకున్న గ్రామంలో కాకుండా మరో గ్రామంలో ఇచ్చారని తెలిపారు. అందుకు కూడా తాము అంగీకరించినా.. ఆ స్థలాన్ని సైతం వెనక్కి తీసుకుని.. నివాసయోగ్యం కాని బండరాళ్లున్న మరో స్థలం ఇచ్చారని వాపోయారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా.. అధికారులు భూసేకరణ చట్టాలను అమలు చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయకుండా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలంటూ బాలరాజు గతేడాది జనవరిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కానీ, ప్రభుత్వం నుంచి చర్యలు లేకపోవడంతో గతేడాది జూన్‌లో హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఈ నెల 24న హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మరోసారి వినతిపత్రం ఇచ్చారు. తనకు చట్టాలపై, న్యాయవ్యవస్థపై నమ్మకం పోయిందని అందులో పేర్కొన్నారు. అలాంటి అధికారులను కొట్టడం, తిట్టడం చట్ట విరుద్ధమైనందున.. నక్సల్స్‌లోకి వెళ్లి ప్రజాకోర్టులు ఏర్పాటు చేసి పేదలకు, సామాన్యులకు, నిరక్షరాస్యులకు న్యాయం చేయాలనే ఆలోచన వచ్చిందని తెలిపారు. అందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి దీనిని పరిశీలించి.. బాలరాజు సమస్యను పరిష్కరించాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కాగా, బాలరాజు మరోసారి ఇదే విజ్ఞప్తితో సోమవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణికి హాజరై వినతిపత్రం ఇచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో ఐదు నెలల జైలు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన చిట్టపురం పోషన్న(58) అనే వ్యక్తి ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2019 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటి పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవే శపెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహన దారుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాడిపల్లి గ్రామానికి చెందిన మామిడాల రవీందర్‌రెడ్డి(53) తన పొలంలో కూరగాయల సాగు కోసం నారు తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై మొలంగూర్‌కు వెళ్లి నారుతీసుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. సింగాపూర్ గ్రామ శివారులోని పెద్ద గుట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్‌రెడ్డి కిందపడిపోయాడు. కిందపడిన రవీందర్‌రెడ్డి శరీరంపై నుంచి భారీ వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై పరిశీలన జరిపారు. మృతుడు మాందాడిపల్లి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

● ఒకరి పరిస్థితి విషమం

హుజూరాబాద్ మండలంలోని రాంపూర్-జూపాక గ్రామ రహదారిపై ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాంపూర్ గ్రామానికి చెందిన మాడుగుల శ్రీనివాస్‌తో పాటు జూపాక గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాయ్యాయి. ఈ ప్రమాదంలో మాడుగుల శ్రీనివాస్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఇల్లంతకుంట నుంచి ద్విచక్రవాహనంపై కముటం శృతి, ఇట్టిరెడ్డి పద్మ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనకనుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శృతి, పద్మ గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై దాడి

ముత్తారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంథని రాజక్క అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన బంధువు మంథని వంశీ మద్యం మత్తులో ఆదివారం రాత్రి దాడి చేశాడు. సమ్మక్క వంశీ ఇద్దరు కలిసి ఆదివారం రాత్రి మద్యం సేవించగా మాటామాట పెరిగి సమ్మక్కపై వంశీ కర్రతో దాడి చేశాడు. గొడవను ఆపేందుకు మంథని రాజక్క అడ్డు రాగా రాజక్కకు గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

జమ్మికుంట సీఐపై విచారణ

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవికుమార్ ఓ అట్రాసిటీ కేసు విషయంలో మధ్యవర్తి వద్ద ముడుపులు తీసుకున్నారని ఎదుర్కొంటున్న ఆరోపణలపై హుజూరా బాద్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. అట్రాసిటీ కేసు విషయంలో రూ. 3లక్షల నగదును మధ్య వర్తి షేక్ సాబీర్ అలీ ద్వారా బాత్‌రూం బకెట్లో పెట్టించి సీఐ తీసుకు న్నాడని, వారి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడి యో రికార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. విచారణకు హాజరు కావాలంటూ షేక్ సాబీర్ అలీకి రెండ్రోజుల క్రితం పోలీసులు నోటీసులు అందజేయగా, హుజూరాబాద్ ఏసీపీ కార్యాల యంలో పోలీసు అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. సీఐ తన వద్ద తీసుకున్న డబ్బులకు సంబంధించిన ఆధారాలు, ఇతర వివరా లు అన్ని విచారణ అధికారులకు అందజేసినట్లు విచారణ అనంతరం షేక్ సాబీర్ అలీ వెల్లడించారు. అట్రాసిటీ కేసు ఫిర్యాదుదారులు, కేసు కాకుండా మధ్యవర్తికి ద్వారా ముడుపులు అప్పగించిన వారిని కూడా పోలీసులు త్వరలో విచారించనున్నట్లు తెలుస్తుంది. సదరు మధ్యవర్తి విచారణకు హాజరయ్యే ముందు తనపై పోలీసులు కేసు పెట్టి రిమాండ్ చేసే అవకాశం ఉందని వీడియో విడుదల చేశాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్లకోట సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌తో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామని తహసీల్దార్ రామచంద్రం సోమవారం తెలిపారు. గ్రామంలోని కోట ప్రాం తంలో కొందరు వ్యక్తులు ఎక్స్‌కావేటర్ యంత్రంతో మట్టిని తీస్తూ రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. వాహనాలను స్థానిక తహసీల్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రామచంద్రం హెచ్చరించారు.

శ్రీరాముడి విగ్రహం ధ్వంసం

● మానేరు వంతెనపై బీజేపీ, హిందూ సంఘాల రాస్తారోకో

తంగళ్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దేవాలయంలో నెలకొల్పిన శ్రీరాముడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో తంగళ్లపల్లి మండలంలో రాస్తారోకో, ఆందోళనలతో ఉద్రిక్తత నెలకొంది. తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో గత శ్రీరామనవమి రోజు పూజలు నిర్వహించి సీతా, రామలక్ష్మణుల విగ్రహాలను తాత్కలికంగా నెలకొల్పారు. సోమవారం ఉదయం శ్రీరాముని విగ్రహం తల ధ్వంసమై ఉండడాన్ని స్థానికులు గమనించారు. గుడికి తాళం లేకపోవడం, ఎవరో ఉద్దేశపూర్వకంగానే శ్రీరాముని విగ్రహాన్ని ధ్వంసం చేశారని భావించారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావుతో పాటు బీజేపీ నాయకులు కేసీఆర్‌నగర్‌లోని ఆలయం ఎదుట ఆందోళనకు దిగారు. విగ్రహం ధ్వసం చేసిన నిందితులను ఆరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ రామ్మోహన్ తన సిబ్బందితో చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయం మండలం మొత్తం వ్యాపించడంతో హిందూ సంఘాలు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు మానేరు వంతెనపై రాస్తారోకోకు దిగారు. సుమారు అరగంట పాటు రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సీఐ మొగిలయ్య, ఎస్ఐ రామ్మోహన్ చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు

యూరియా కోసం బారులు



సారంగాపూర్ సహకార సంఘం వద్ద రైతులు

సారంగాపూర్, జనవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం యూరియా కోసం బారులు తీరారు. ఒక్కో రైతుకు ఆధార్‌కార్డుపై ఐదు బస్తాలను అందించారు. చాలా మంది రైతులకు యూరియా అందక పోవడంతో గంటల కొద్ది లైన్‌లో నిలబడి వెనుదిరిగారు. యూరియా కొరతపై సహకార సంఘం సీఈవో శివను వివరణ కోరగా సోమవారం రైతులు ఒక్కసారిగా రావడంతో కొరత ఏర్పడిందన్నారు. మంగళవారం మరో లారీ లోడ్ యూరియా వస్తుందని రైతుతు వచ్చి తీసుకెళ్లాలని వివరణ ఇచ్చారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన



సాగునీటికోసం డి86కాలువ వద్ద రైతులు

ఎలిగేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొలాలకు ఎస్సారెస్పీ సాగునీరు అందడం లేదని సోమవారం ఎలిగేడు, లాలపల్లి ఆయకట్టు ప్రాంత రైతులు డి-86ప్రధాన కాలువ వద్ద ఆందోళన చేశారు. 13-ఎల్ ఉపకాలువ ద్వారా 55 ఎకరాల పైచిలుకు పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. నాట్లు వేసుకొని రోజులు గడుస్తున్నా తక్కువ నీరు రావడంతో సుమారు 25మంది రైతులు డి-86 ప్రధాన కాలువ వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ డీఈ ఎండి.షిరాజ్, ఏఈలు అయూబ్, జెలని సమస్యను పరిష్కరిస్తామన్నారు. 13ఎల్ కాలువ తూములో గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లు వేయడంతో నీటి సరఫరా తక్కువైందని రైతులకు వివరించారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో తూముల్లో అడ్డుగా ఉన్నబండరాళ్లను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈడీఈ షిరాజ్ మాట్లాడుతూ కాలువల్లో అడ్డుగా బండలు వేసినా, తూములను ధ్వంసం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ముత్కల మల్లేశం, వెంగల్‌దాసు తిరుపతి, ముంజంపల్లి చిన్నసాయిలు, బావు రవీందర్, సప్పుల రవి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై కేసు

-ఎన్నికల నిబంధనలు అతిక్రమించాడని కోర్టులో పిటిషన్

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడనే ఫిర్యాదుపై కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై శనివారం కేసు నమోదైంది. 2018 ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన పుల్లా రాజగౌడ్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని కోర్టులో పిటిషన్ వేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 25న కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు గంగాధర రమేష్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక తలుపు తొలగించి దొంగలు లోనికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రూ.3.46లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. రమేష్ కుటుంబ సభ్యులు ఆదివారం గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌కు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి చోరీ విషయం వెలుగులోకి వచ్చింది.

ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

వీణవంక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడగా, మృతికి కారణమైన భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన నీల సాయికిరణ్ అనే వ్యక్తి రమ్య అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్నప్పటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశాడు. భరించలేక వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. తన మేనకోడలు మృతికి భర్త కారణమంటూ మృతురాలి మేనమామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాయి కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?


- 13 ఏళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- పూర్తి కాక నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి భక్తుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గుట్టపై వెలిసిన నర్సింహస్వామి

పూర్తయిన ఫార్మేషన్ రోడ్డు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన కొండపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్ష మెప్పుడు కలుగుతుందోనని భక్తులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏటా మాఘ మాసంలో పౌర్ణమికి ముందు నాలుగు రోజుల పాటు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. 1967 సంవత్సరంలో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పుడు స్వామి వారి ఆదాయం 1800 రూపాయలు ఉండగా ప్రస్తుతం 60లక్షల రూపాయలకు చేరుకుంది. ఎత్తైన గుట్టపై స్వామి వారు వెలియడంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. గుట్టపై ఉన్న స్వామి వారిని దర్శించుకోవ టానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో ఆలయ ఫౌండరీ ఛైర్మన్ చెన్నాడి సత్యనారాయణరావు 1991-1993 సంవత్సరంలో గుట్ట కింద నర్సింహ స్వామి ఆలయాన్ని నిర్మించి స్వామి వారిని ప్రతిష్ఠించారు. వివిధ రకాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విజయం చేకూర్చమని నర్సింహస్వామికి ముడుపులు కడతారు. పదవులు వచ్చాక ఘాట్ రోడ్డు నిర్మాణం మరిచి పోతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.



నల్లగొండలో నర్సింహస్వామి గుట్ట



ఘాట్ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

2012లో పనులకు శంకుస్థాపన

2012లో అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత్త మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ఎంపీ 10లక్షల రూపాయలు, దేవాలయ నిధులు 30లక్షల రూపాయలతో ఫార్మేషన్ రోడ్డు చేశారు. ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగినట్లయితే భక్తుల రద్దీ పెరగటంతో పాటు ఆలయానికి ఆదాయం పెరుగుతుంది. ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాలకు మధ్యలో కొడిమ్యాల మండలంలోని నల్లగొండ నర్సింహస్వామి ఆలయం ఉంది. గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, సైడ్ డ్రైనేజీ, సీసీ నిర్మాణం, రోడ్డుపై అవసరం ఉన్న చోట కల్వర్టుల నిర్మాణం, పైపుల ఏర్పాటు, కింది నుండి గుట్టపై వరకు విద్యుత్ లైట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తులకు డార్మెటరీ హాల్, తాగు నీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత శాఖ అధికారులు నిధులు మంజూరు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి డిగ్రీ కళాశాల విద్యార్థి



జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన సాయిచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గడప సాయిచరణ్ అనే విద్యార్థి కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో భాగంగా అగ్రహారం డిగ్రీ కళాశాల నంచి సాయిచరణ్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు జరగబోయే జాతీయ సమైక్యతా శిబిరంలో సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాల్లో సాయిచరణ్ పాల్గొంటాడని తెలిపారు. సాయిచరణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు శారద, శకుంతల అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెద్దపులి ఆనవాళ్లు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుకార్లను నమ్మవద్దని, పులి సంచారంపై ఎలాంటి సమాచారం ఉన్నా తెలుపాలని ప్రజలను కోరారు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై ఐదు రోజుల క్రితం పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందగా అటవీ అధికారులు మండలంలోని బొల్లోనిచెరువు. కొండాపూర్, నల్లగొండ శివారులను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతాల్లో పెద్దపులి ఆనవాళ్ల కోసం తిరుగుతున్నారు. వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, నూకలమర్రి శివారులో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులను, వ్యవసాయ కూలీలను, పశువుల కాపరులను పెద్దపులి ఆనవాళ్లపై వివరాలు తెలుసుకున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో డీఆర్వో ముషీర్ ఆహ్మద్, బీట్ అధికారులు అశ్విని, ఆనందరావు, వసీం, ప్రవీణ్, మహేందర్, వాచర్లు ఐదు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతాన్ని నాలుగు బృందాలుగా విడిపోయి పరిశీలిస్తున్నారు. అడవిలో సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించక పోవడంతో కొడిమ్యాల అటవీ ప్రాంతం నుంచి పెద్దపులి పోయినట్లుగా అటవీ అధికారులు భావిస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు

- ప్రారంభించనున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి



క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలు మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కరీంనగర్ క్రీడా కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. జిల్లా కేంద్రంలోని 12 క్రీడావేదికలపై 29 క్రీడ అంశాలలో పోటీలను ఘనంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లోని క్రీడా మైదానంలో డీజీపీ ఇంటెలిజెన్సీ తెలంగాణ శివధర్ రెడ్డి ప్రారంభించనున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని సీటీసీ, హెడ్ క్వార్టర్స్, అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్, సీపీటీసీ, కరీంనగర్ క్లబ్, జీఎస్ అకాడమీ, అలుగునూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలు..

- సీపీకి ఫిర్యాదు చేసిన మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనపై గత 3 రోజులుగా బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ వి రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ 43వ డివిజన్ అధ్యక్షుడు నవాజ్ హుస్సేన్‌లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర మేయర్ వై సునీల్‌రావు సోమవారం పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. తన ఫోటోలతో అసభ్యకరంగా, పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేస్తున్నవారిపై చర్యలు తీఉకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేసి విచారణ జరిపించాలి

సుభాష్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ధరణి 13బి ద్వారా అక్రమ పట్టాలను రద్దు చేసి, దానిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్, కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలకు చెందిన తమ భూములను గత 30 సంవత్సరాలుగా తామె సాగుచేసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణీ పోర్టల్ ద్వారా ఒక వ్యక్తి అప్పటి జమ్మికుంట తహసీల్దార్ కన్నం నారాయణ ద్వారా ఎలాంటి విచారణ చేయకుండా తమ కుటుంబ సభ్యులు, బంధువులపేరుపై 13బి పట్టాలు పొందారని ఆరోపించారు. ఆయన తరువాత వచ్చిన తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్ళామని ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సంతకాలు ఫోర్జరీ చేసి చర్చికి అంబేడ్కర్ భవనంకు స్థలం ఇచ్చినట్లుగా చూపుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంపత్, శ్రీనివాస్, కొండయ్య పాల్గొన్నారు.

వేములవాడ క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- స్వామి వారి దర్శనానికి నాలుగంటల సమయం



భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి బారులు తీరారు. ఆది దేవుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు కోడెమొక్కు క్యూలై న్‌లో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని మొక్కు లు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు అభిషేక పూజలో పాల్గొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మహా లింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సోమవారంను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు చేపట్టారు. సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో లింగార్చనంలో దీపా లను వెలిగించి మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో పలుకుబడికి పెద్దపీట

- ఎక్స్ వేదికగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన భక్తుడు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలో నిబంధనలకు విరుద్ధంగా పలుకుబడి ఉన్న ఓ పెద్ద మనిషికి ప్రాముఖ్యత ఇవ్వడం విమర్శలకు దారితీసింది. రాజన్న ఆలయంలో ప్రతి సోమవారం ఉదయం నిర్వహించే నిత్యపూజలు, అలంకరణ పూర్తి కాకముందే స్వామి వారితో పాటుగా అమ్మవారిని దర్శించుకుంటున్న తీరు ప్రస్తుతం వేములవాడలో చర్చనీయంశంగా మారింది. ప్రతి సోమవారం ఉదయం నాలుగు గంటలకు స్థానికులకు ఉచిత దర్శనం అవకాశం ఉంది. స్థానికేతరుడైన అతను తన కుటుంబీలకుతో కలిసి స్వామివారి గర్భగుడిలో గంటల తరబడి పూజలు చేస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తికి పూజారులు దగ్గరుండి మరీ పూజలు నిర్వహిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి.

సోమవారం ఉదయం రాజన్న ఆలయ గర్భగుడిలో అతను పూజలు నిర్వహిస్తుండగా స్థానిక భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఓ భక్తుడు రాజన్న ఆలయ ఈవోకు వాట్సప్‌లో, జిల్లా కలెక్టర్, సీఎంవోకు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆలయ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రూ.7, 150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 29మంది రైతులు 324 క్వింటాళ్లు విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 21క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

యూజీసీ గైడ్ లైన్స్ వెనక్కి తీసుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ గైడ్ లైన్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ గైడ్‌లైన్స్ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకు అతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే వీసీలుగా నియమించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారాపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కనకం సాగర్, లద్దునూరి విష్ణు పాల్గొన్నారు.

గేట్ పడితే పడిగాపులు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



చేగుర్తికి వెళ్లే దారిలో రైలు గేటు పడటంతో నిరీక్షిస్తున్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ నుంచి చేగుర్తికి వెళ్లే దారిలో రైల్వే గేటు పడిన ప్రతిసారి వాహనదారులు, గ్రామస్థులు పడిగాపులుకాస్తున్నారు. గతంలో అప్పుడప్పుడు పడే గేటు తరచూ పడుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ మీదుగా రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగింది. దీంతోపాటు ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతున్నారు. మరోవైపు బొగ్గు, ఎరువులు, గ్రానైట్ గూడ్స్ రైళ్ల ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటాయి. దీంతో రోజుకు 10 నుంచి 12 సార్లు గేటు పడుతోంది. నాయకులు, అధికారులు స్పందించి ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ మార్గదర్శకాలు తీసుకురావడం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియని, యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తిని కోల్పోయే అవకాశం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించిన యూజీసీ మార్గదర్శకాలపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత ఏర్పడుతోందన్నారు. యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ జిట్ట బాలకృష్ణ తెలిపారన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహించేలా మార్గదర్శకాలు ఉన్నాయని, కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాసే చర్యగా కనిపిస్తోందని వెల్లడించారు.

చివరి ఆయకట్టుకు చేరని మిడ్‌మానేరు నీరు

- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు



పెర్కపల్లి వద్ద నిలిచిన కాలువ నీరు



వెన్కేపల్లి శివారులో ఎండిపోతున్న మొక్కజొన్న చేనును చూపిస్తున్న రైతు

సైదాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్, సైదాపూర్, జాగీర్‌పల్లి, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి గ్రామాలకు కాలువ ద్వారా మిడ్ మానేరు నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. పంటలు ఎండుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలంలో పంటలు సుభిక్షంగా పండాలని ముందుగానే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మానేరు కాలువకు నిధులు విడుదల చేసినప్పటికీ చివరి వరకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పెర్కపల్లి గ్రామం వరకు నీరు వచ్చి ఆగుతుందని, అక్కడి నుంచి మిగతా ప్రాంతాలకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. కాలువల పనులు పూర్తి చేయకపోవడంతో అధికారులు కిందికి నీటిని వదులడం లేదని రైతులు పేర్కొంటున్నారు. నీరు చివరి ఆయకట్టు వరకు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు మా గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

మొక్కజొన్న ఎండుతోంది



- ఏనుగుల మహేందర్, రైతు, వెన్కేపల్లి

సైదాపూర్ శివారులో నేను నాలుగెకరాల మొక్కజొన్న సాగు చేశాను. కానీ నీరు లేకపోవడంతో మొక్కజొన్న పూర్తిగా ఎండుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ ద్వారా నీరు విడుదల చేయాలి.

నీరులేక పంటలు ఎండుతున్నాయి



- మెడవేన రాజు, రైతు, గుజ్జులపల్లి

నేను గుజ్జులపల్లి శివారులో మూడెకరాల వరకు పల్లి చేను వేశాను. నీరు లేకపోవడంతో పూర్తిగా ఎండుతుంది. అధికారులు మిడ్ మానేరు నీరు కాలువ ద్వారా విడుదల చేసి పంటలను కాపాడాలి.

అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా



- పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాలకు మిడ్ మానేరు నీరు రావడం లేదని నా దృష్టికి వచ్చింది. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా.

నేడు ప్లేస్‌మెంట్ డ్రైవ్

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల మరియు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రామకృష్ణ కళాశాల ఆవరణలో ఈ నెల 28 మంగళవారం రోజున ప్రాంగణ నియామక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ రాజేందర్‌లు తెలిపారు. ఈ ప్రాంగణ నియామక ప్రక్రియలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన టెక్ మహీంద్రా, క్యూ కనెక్ట్, క్యూస్ సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 2020నుంచి 2024 వరకు డిగ్రీ పూర్తిచేసిన, ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మల్లేశం 8499807141 నెంబర్‌కు సంప్ర దించాలని కోరారు. విద్యార్థులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కమిషనర్‌ను అభినందించిన మాజీ కౌన్సిలర్లు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగ ఉత్తమ ఉద్యోగ ప్రశంసా పత్రం పొందిన జగిత్యాల మున్సిపల్ కమిషనర్ చిరంజీవిని మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పంబాల రాము, కోరె గంగమల్లు, పిట్ట ధర్మరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బద్దం జగన్మోహన్ రెడ్డి, కొలగాని సత్యం, కూతురు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న మార్కండేయ జయంతికి జగిత్యాల తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతిలక్ష్మణ్‌కు సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బుగ్గారం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలింగార్చన

ధర్మపురి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని అనుబంధ శ్రీ రామ లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాసశివరాత్రి పర్వది నాన్ని పురష్కరించుకొని వేదికపై వేదపండితులు, రుద్రనమకం, చమకం మన్యసూక్తం, లక్ష్మీసూక్తం, పురుషసూక్తంతో మహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పణతుల వెంకటరమణ శర్మ, మధురామశర్మ, పెండ్యాల రాజేష్ శర్మ, సాయికుమార్, పలువురు అర్చకులు ఉన్నారు.

మెప్మా ఆర్‌పీలకు జీతాలు వచ్చేశాయ్

- ఏడు నెలల బకాయిలు విడుదల
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఆర్‌పీలు

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తూ మున్సిపాలిటీల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల పొదుపు లెక్కా పద్దులు, బ్యాంకు రుణాలు ఇప్పించే బాధ్యతలు చూసే ఆర్ పీ (రిసోర్స్ పర్సన్)లకు అధికారులు వేతన బకాయిలు అందజేశారు. ఆర్‌పీలకు ఈఏడాది జూన్ నుంచి వేతనాలు ఆగిపోయాయి. సంఘాలా బాధ్య తలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్పంచుకునే ఆర్‌పీలకు చాలీచాలని వేతనం ఇస్తున్నారు. ఇది కూడా సకాలంలో అందించడం లేదు. ఈ ఏడాదికి సంబంధించి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల ఎట్టకేలకు జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న 173 మంది ఆర్‌పీలకు సంబంధించి ఏడు నెలల బకాయిల వేతనాలు రూ.72.66 లక్షలు విడుదల చేసి తీపి కబురు అందించింది. ఈ మొత్తాన్ని మహిళా స్వయం సహాయక సంఘాల సమాఖ్యల ఖాతాల్లో జమ చేశారు. దీంతో ఆర్‌పీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ.600 నుంచి పని ..

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం మెప్మా ఆర్‌పీలకు నెలకు 600 పారితోషకం అందించేది. ఆ తర్వాత ఆ పారితోషకాన్ని వెయ్యికి, తరువాత రెండు వేలకు పెంచుతూ వచ్చింది. 2018 నుంచి ఆర్‌పీలకు నెలకు రూ. 4 వేల వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రూ. 2 వేలు కలిపి రూ. 6 వేల చొప్పున స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. ఇచ్చే తక్కువ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషకం పేరుతో ఇవ్వడాన్ని పలువురు ఆర్‌పీలు వ్యతిరేకిస్తున్నారు. అంతే కాకుండా కనీస వేతనం అమలు చేయాలని వారు కోరుతున్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అనేక పర్యాయాలు మంత్రులు, కలెక్టర్లుకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద దర్నా చేశారు. అయినా వారి సమస్య పరిష్కారం కాలేదు. దీనికితోడు గత ఏడు నెలలుగా వేతనాలు సైతం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏడు నెలల వేతన బకాయిలను ఒకే పర్యాయంలో విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్‌పీలు(ఫైల్)

విడుదల అయిన వేతన బకాయిలు ఇలా..

మున్సిపాలిటీ	ఆర్‌పీలు సంఖ్య	వేతనం
జగిత్యాల	61	రూ.25.62 లక్షలు
కోరుట్ల	50	రూ.21.00 లక్షలు
మెట్‌పల్లి	34	రూ.14.28 లక్షలు
రాయికల్	16	రూ. 6.72 లక్షలు
ధర్మపురి	12	రూ. 5.04 లక్షలు
మొత్తం	173	రూ. 72.66 లక్షలు

ఆర్‌పీల వేతన బకాయిలు మంజూరు



మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పీల ఏడు నెలల వేతన బకాయిలను ప్రభుత్వం ఇటీవల మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి విడుదల చేసింది. ఈ నిధులు మహిళా స్వయం సహాయక సంఘాల సమాఖ్యల ఖాతాల్లో జమ అయ్యాయి. ఆయా ఖాతాల నుంచి ఆర్‌పీలు వేతనాలు అందుకున్నారు.

-శ్రీనివాస్ గౌడ్, మెప్మా పరిపాలన అధికారి

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పిఆర్‌టియూ టీఎస్ రాష్ట్ర శాఖ ఆదేశానుసరంగా సోమవారం మధ్యహ్న భోజన సయంలో మెట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్‌కు పిఆర్‌టీయు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి గంగా ప్రసాద్, నాయకులు గణేష్, అనూజ, నరేంధర్, జగన్‌మోహన్, సుధాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ వాజిద్, జక్కుల నవీన్ కుమార్, అడ్డగట్ల శ్రీనివాస్, సయ్యద్ సైఫోద్దీన్, యూసుఫ్ అలీ పాల్గొన్నారు.

●ఎండపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మునిందర్, లక్ష్మిరాజం, శ్రీనివాస్, శావణ్, అశోక్ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

●భీమారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ రావు, భీమారం మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, భూమయ్య, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల, జనవరి27 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు రమేష్‌కు పీఆర్‌టీయుటీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందిచారు. పీఆర్‌టీయుటీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తైదల అంజయ్య, రాష్ట్ర అసోసీయేట్ అధ్యక్షుడు రాజమల్లయ్య, జిల్లా కౌన్సిలర్ రాజయ్య పాల్గొన్నారు.

●వెల్గటూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పీఆర్టీయు టిఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో తహసిల్దార్ శేఖర్ కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, సంఘ బాధ్యులు శ్రీనివాస్, రాకేష్, పోచన్న పాల్గొన్నారు.

●రాయికల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ తహసీల్దార్ ఎంఏ ఖయ్యూంకు పీఆర్‌టీయూ ప్రతినిధులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్, రాష్ట్ర కార్యదర్శులు లక్కాడి రాజరెడ్డి, అక్కినపెల్లి సతీష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేని మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్, మండల కార్యదర్శి సిలివేరి రమేష్, పాల్గొన్నారు.

●గొల్లపల్లి : తహసీ ల్దార్‌కు ఉపాధ్యాయులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్ర మంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

గొల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి శాశ్వత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంకోసం గ్రామానికి చెందిన ముద్దం వినోద్ గౌడ్, అంజి గౌడ్‌లు రూ. 25 వేల విరాళంను ఆలయ పూజారి కూర్మచలం సత్యానారాయణాచార్యులకు సోమవారం అందజేశారు. అలాగే సుదర్శన చక్రం కోసం గ్రామానికి చెందిన సల్లూరి పావని-శోభన్ గౌడ్ దంపతులు రూ. 10500 విరాళంను అందించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి తమ వంతు ఆర్థిక సాయం అందించిన దాతలకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీరువా అందజేత

ఎండపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట గ్రామంలో జీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖకు మందులు భద్రపరుచుకోవడానికి బీరువా బహూకరించడం జరిగింది. అడగగానే స్పందించి బీరువా బహూకరించిన జీరెడ్డి మహెందర్‌రెడ్డికి ఆరోగ్య శాఖవారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లావణ్య, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు ప్రమీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

కమల దళపతి ఎవరో...?

5వ పేజీ తరువాయి..

కల్పించాలని కోరుతున్నారు. మిగితావారు తాము పూర్తిగా సమయం కేటాయించి పార్టీ కోసం పని చేశామని, అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

● స్థానిక ఎన్నికలే లక్ష్యం

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానుండడంతో పార్టీ గెలుపునకు జిల్లా అధ్యక్షుడి పాత్ర కీలకం కానుంది. దీంతో అధిష్ఠానం ఆచితూచీ నిర్ణయం తీసుకోనుంది. ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, మున్సిపల్ ఎన్నికలు సైతం రానున్నాయి. ఈసారి ఎలాగైనా మెజారిటీ సీట్లు సాధించాలన్న లక్ష్యంతో పార్టీ నాయకత్వం ముందుకు పోతుంది. దీంతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ పట్టు సాధించాలనే దృఢ సంకల్పంతో బీజేపీ ఉంది. ఈ క్రమంలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తే తామనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతామనే ఆలోచించి నిర్ణయం తీసుకొనే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. వారంలోపు జిల్లా అధ్యక్షుడి పేరు ఖరారయ్యే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

క్రీడా మైదానానికి భూమి కేటాయించాలి

కథలాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో క్రీడా మైదానానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని సోమవారం పలువురు యువకులు తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ క్రీడల కోసం మైదానం లేక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

కథలాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంబీర్‌పూర్ సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ మాట్లాడుతూ క్రీడలలో విద్యార్థులు రాణించాలని రూ.20 వేల విలువ గల కిట్స్‌తో పాటు డ్రెస్‌లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

భీమారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని గోవిందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన సీహెచ్ నాగమణి, బి.జశ్వంత్, సీహెచ్ విఘ్నేష్‌లు పెద్దపల్లి జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరాం నాయక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అష్ఫాక్ హుస్సేన్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కవితశోభన్, గ్రామస్థులు అభినందించారు.

సీఐకి ఘన సన్మానం

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డుకు ఎంపికైన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని సోమవారం పలువురు నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, బీజేవైఎం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, సెక్రటరీ రాకేష్, వేణు గోపాల్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ఆర్యూర్ రంజీత్, రాజు, మాజీ సర్పంచ్ పీసు తిరుపతి రెడ్డి, స్వామి రెడ్డి పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్ : ఇండియన్ పోలీస్ అవార్డుకు ఎంపికైన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఎంపికైనందుకు మండలంలోని కోండ్రికర్ల గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం గ్రామానికి చెందిన నాయకులు గడ్డం రాజారెడ్డి, గంట రాజేశ్వర్‌యాదవుల ఆధ్వర్యంలో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ సీఐని శాలువలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. సీఐ నిరంజన్‌రెడ్డికి జాతీయ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

భూమి అక్రమ పట్టాలు రద్దుచేయాలి

జగిత్యాలరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో గల సర్వేనంబర్లు, 251, 437 లోని ప్రభుత్వ భూములను కబ్జాచేసుకొని పట్టాలుపొందిన వ్యక్తుల పట్టాలను రద్దుచేసి నర్సింగాపూర్ గ్రామంలోని దళితులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో నర్సింగాపూర్ దళితులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నర్సింగాపూర్ గ్రామానికి సంబంధంలేని వ్యక్తులు, జగిత్యాల పట్టణానికి చెందిన కొంతమంది ధరణి లో అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మకై పట్టాలు పొందారని లేఖలో పేర్కొన్నారు. అక్రమార్కుల నుండి ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకొని మొదటి ప్రాధాన్యతగా గ్రామంలో భూములు లేని దళితులకు, బడుగుబలహీనవర్గాల ప్రజలకు పంపిణీ చేయాలని వారు లేఖలో కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మల్యాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

మల్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 30, 31న కోరుట్లలో జరిగే రాష్ట్ర రెండవ మహసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత ఈ సందర్భంగా కోరారు. మహాసభల కర పత్రాలను మల్యాలలో సోమవారం ఆవిష్కరించారు. బీడీ పరిశ్రమ కార్మికులకు సంబంధించి పది డిమాండ్ల సాధనకు కార్యచరణ రుపొందించడం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులతో పాటు బీడీ కార్మికులు పాల్గొన్నారు

క్రీడలపై దృష్టి సారించాలి

● టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు

మల్లాపూర్, జనవరి, 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు క్రీడలపై దృష్టి సారిస్తే ఆరోగ్యంగా ఉంటారని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకం ఏర్పాటు చేసిన జెర్సీలను ఆవిష్కరించి క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్‌పీఎల్ చైర్మన్ మహబూబ్‌ఖాన్, నాయకులు కొమ్ముల చిన్నారెడ్డి, వాకిటి సత్యంరెడ్డి, అంతడపుల నర్సయ్య, ఎల్లా జలపతిరెడ్డి, కూన గోవర్ధన్, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి శ్రీనివాస్, రొడ్డ రాజు, బిట్ల నరేష్, గంధం రాజేశం, భైరవేణి శశిగౌడ్, అశోక్, శరత్, లింగారెడ్డి, నరేష్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ..

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో 43 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్‌లు గౌతమ్ రెడ్డి, బీఎస్ లత, ఆర్డీవో మధుసూదన్‌లు అర్జీలను స్వీకరించారు.

రుణమాఫీ కాలేదు

రైతులు, లక్ష్మీపూర్, జగిత్యాల మండలం

గ్రామంలో వంద మందికి పైగా రైతులకు రుణమాఫీ ఇప్పటివరకు పడలేదు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ అంతకన్నా తక్కువ ఉన్నవారికి కూడా ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుంది. అధికారులు ఇకనైనా స్పందించి తమకు రుణమాఫీ వచ్చేలా చేయాలి.



లక్ష్మీపూర్ రైతులు

బీడీల పెన్షన్ ఇప్పించండి..

-సారంగాపూర్ మండలం అర్పపల్లి బీడీ కార్మికులు

మాకు బీడీల పెన్షన్ రావడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించినా స్పందించిన పాపాన పోవడం లేదు. పెన్షన్ పొందుటకు మేము అర్హులం. మేము బీడీలు చేస్తు జీవనాన్ని కొనసాగిస్తున్నాము. అయినప్పటికీ అధికారులు మాకు పెన్షన్ ఇవ్వడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలి.



ఆరెపల్లి బీడీ కార్మికులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ధర్మపురి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో స్నేహ మిత్ర యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు జాజాల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన మడ్డి రంజిత్ విన్నర్స్ టీమ్‌కు రూ 5000 నగదు, జుంజురు నవీన్ రన్నర్స్ టీమ్‌కు రూ 2500 నగదు బహుమతులు ముఖ్య అతిథిగా విచ్చేసని ఏఎస్ఐ సూర్యనారాయణరాజు చేతుల మీదుగా అందించారు. క్రికెట్ టోర్నమెంట్ కోసం బైరి గణేష్ రూ 5000, కాశెట్టి మల్లేశం రూ 2500 ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో స్నేహ మిత్ర యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది జాజాల రమేష్, నేరెళ్ల మాజీ ఎంపీటీసీ ఇంద్రాల మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ జాజాల శంకర్, గోవింద్‌పల్లె కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పురంశెట్టి మల్లేశం పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లిలో సోమవారం పశు వైద్యులు కమలాకర్, రాజేష్ ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిం చారు. అనంతరం గోగూరి రవీందర్‌రెడ్డి, కసిరెడ్డి మల్లారెడ్డి అనె రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామ యువకులు

గొల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో క్రీడల్లో రాణించేందుకు క్రీడామైదానంను ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ యువకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మపురి క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనికి వెంటనే సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ క్రీడామైదానం కోసం స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ వరందన్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేసినట్లు యువకులు తెలిపారు. గ్రామంలో విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో ఉన్నారని, క్రీడల పట్ల మక్కువ ఉన్నప్పటికి క్రీడామైదానం లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నామని ప్రభుత్వ విప్‌తో యువకులు వాపోయారు. అలాగే స్థానికంగా ఉన్న ఐకేపీ కేంద్రం స్థలం సరిపోక రైతులు తమ వరి ధాన్యంను రోడ్ల వెంట పోయాల్సిన దుస్థితి నెలకొందని, దీనికి కేంద్రంను మరింత విస్తరించాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌తో మొరపెట్టుకున్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన లక్ష్మణ్ కుమార్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తమ సమస్యలను దృష్టికి తీసుకెళ్లగానే యుద్ధప్రతిపాదికన స్పందించి పరిష్కారానికి సంబంధిత ఆదేశాలు జారీ చేసిన లక్ష్మణ్ కుమార్‌కు గ్రామ యువకులు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

రాయికల్, జనవని 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. విజనరీ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రూ.7 వేల విలువ గల కలర్ ప్రింటర్‌ను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజనేయులుకు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాద శేఖర్, అత్తినేని గంగరాజం, దిండిగాల రాజేష్, ఉపాధ్యాయులు కన్నవేని మల్లారెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రాయికల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల క్లబ్ కార్యదర్శిగా మహ్మద్ రుక్నొద్దీన్ ఎన్నికయ్యాడు. మండల క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం నియమించారు. సంయుక్త కార్యదర్శిగా గట్టు రమేష్ నర్సయ్య, కోశాధికారిగా సింగని రమేష్, సాంస్కృతిక కార్యదర్శిగా వాసరి రవి, క్రీడా కార్యదర్శిగా బత్తిని భూమయ్యలు ఎన్నికయ్యారు.

గ్రీన్ డే వేడుకలు

రాయికల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో సోమవారం గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రీన్ దుస్తులు ధరించి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు పచ్చని టీషర్టులు ధరించి పచ్చని అమెజాన్ అడవిలా కనిపించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, షారు, సంజన, శృతి, రజిత, హిందూజా, శ్రీజ, మనీషా, స్రవంతి, అపర్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు హర్షణీయం

భీమారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డుతో సరైన గౌరవం లభించిందని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షుడు బంగారు దీపక్ అన్నారు. మాదిగ కులాల కోసం మందకృష్ణ మాదిగ చేసిన కృషికి నిదర్శనంగా అవార్డు దక్కిందని పేర్కొన్నారు.